Office Of The Advisor (Communications)
Govt. Of Andhra Pradesh

# 24న ఫోస్టర్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబు భేటీ

## అక్టోబరు 11, 12, 13 తేదీలలో లండన్‌లో కార్యగోష్ఠి

## 25న తుది ఆకృతుల సమర్పణ

అమరావతి, సెప్టెంబర్ 27 : రాష్ట్ర పరిపాలన నగరం ఆకృతులు, నిర్మాణ ప్రణాళికలను రూపొందిస్తున్న ప్రఖ్యాత అంతర్జాతీయ రూపశిల్పి నార్మన్ ఫోస్టర్‌తో అక్టోబరు 24, 25 తేదీలలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమావేశం కానున్నారు. లండన్‌లో జరిగే ఈ సమావేశంలోనే అమరావతి ప్రభుత్వ భవన సముదాయాల తుది ప్రణాళికలు, ఆకృతులను ఖరారు చేయనున్నారు.

అక్టోబరు 11, 12, 13 తేదీలలో లండన్‌లోనే నార్మన్ ఫోస్టర్ బృందం ఆధ్వర్యంలో పరిపాలన నగర ఆకృతుల రూపకల్పనపై ప్రత్యేక కార్యగోష్ఠి నిర్వహించనున్నారు. ఈ కార్యగోష్ఠిలో తన బృందంతో పాల్గొని తగు సలహాలు, సూచనలు అందించడానికి తెలుగు చలనచిత్ర దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి సంసిద్ధత వ్యక్తం చేశారని రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (సీఆర్‌డీఏ) కమిషనర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ తెలియజేశారు. బుధవారం ఉదయం సచివాలయంలో జరిగిన సీఆర్‌డీఏ వారాంతపు సమీక్షా సమావేశంలో ఆయనీ వివరాలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువచ్చారు.

ప్రణాళికల దశ నుంచి బయటపడి ఇక సత్వరం పనులను ఆరంభించాలని, ఇప్పటికే నిర్మాణంలో ఉన్న వివిధ ప్రాజెక్టు పనులలో వేగం పెంచాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ సమావేశంలో సీఆర్‌డీఏ, ఏడీసీ అధికారులకు సూచించారు. రాజధాని నిర్మాణాన్ని ఏదో ఒక సాధారణ ప్రాజెక్టుగా తీసుకోవడం సరికాదని, ప్రపంచంలోని తొలి అగ్రశ్రేణి నగరాలలో ఒకదాన్ని నిర్మిస్తున్నామనేది ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. రాజధాని నిర్మాణంలో సహకరిస్తున్న సంప్రదింపుల సంస్థలు ఈ విషయంలో మరింత శ్రద్ధ కనబరచాలని, తమ సంస్థల్లో పనిచేస్తున్న అత్యుత్తమ మేధస్సు గల వారిని అమరావతి రూపకల్పనలో భాగస్వామ్యం చేయాలని కోరారు. రాజధాని కోసం భూములు అందించిన రైతులకు ప్లాట్ల రిజిస్ట్రేషన్లను ప్రారంభించామని, ప్రస్తుతం నాలుగు గ్రామాలలో ఈ ప్రక్రియ కొనసాగుతోందని సీఆర్‌డీఏ కమిషనర్ చెప్పారు. భూ సమీకరణ జరిగిన గ్రామాలలో 1400 ఎకరాల వరకు జిల్లా కలెక్టర్ నుంచి నిరభ్యంతర పత్రాలను అందిస్తే రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో ఎదురైన స్వల్ప అడ్డంకి తొలగిపోతుందని ముఖ్యమంత్రి

దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి తగు నిర్ణయం తీసుకుంటారని ముఖ్యమంత్రి చెప్పారు.

అమరావతిలోని నవ నగరాలలో ఆర్థిక అభివృద్ధికి తక్షణం దోహదం చేసే జాతీయ, అంతర్జాతీయ స్థాయి విద్యాసంస్థలు, హోటళ్ల ఏర్పాటుపై నిర్దిష్ట లక్ష్యాలను ముందుపెట్టుకుని తదనుగుణంగా కార్యాచరణ చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. అమరావతిలో విద్యాలయాలను ఏర్పాటు చేయడానికి 25 ప్రఖ్యాత సంస్థలు ముందుకొచ్చాయని, అందులో 11 జాతీయ, అంతర్జాతీయ విద్యాసంస్థలు ఇప్పటికే తమ ప్రాతిపాదనలను పంపించాయని సీఆర్‌డీఏ కమిషనర్ చెప్పారు. వీటిల్లో 8 సంస్థలు తొలి పది ర్యాంకులలో నిలవగా, మిగిలిన 3 విద్యాలయాలు 11 నుంచి 15 మధ్య ర్యాంకులలో ఉన్నాయని తెలిపారు. ఇవిగాక మరో 13 సంస్థలు తమంతట తాముగా అమరావతి రావడానికి ఆసక్తి వ్యక్తీకరించాయని వివరించారు. ఒక్కొక్కటీ 5 ఎకరాలలో నెలకొల్పే 2 కేంద్రీయ విద్యాలయాలకు ఆమోదం లభించిందని చెప్పారు. స్కాటిష్ హై ఇంటర్నేషనల్ స్కూల్, చిన్మయ మిషన్, కేండోర్ ఇంటర్నేషనల్ స్కూల్, ది హెరిటేజ్ స్కూల్, సద్భావన వరల్డ్ స్కూల్, ర్యాన్ గ్లోబల్ స్కూల్, పోడార్ స్కూల్, గ్లాండేల్ అకాడమీ, ఢిల్లీ పబ్లిక్ స్కూల్, జీఐఐఎస్, డీఏవీ గ్రూపు ఆఫ్ స్కూల్స్ ప్రతిపాదనలు పంపాయన్నారు.

ఇవిగాక, జూబ్లీ పబ్లిక్ స్కూల్, సెయింట్ మాథ్యూస్ పబ్లిక్ స్కూల్, శ్రీ సరస్వతి విద్యాపీఠం, లయోలా పబ్లిక్ స్కూల్, విజ్ఞాన విహార విద్యాకేంద్రం, సిద్ధార్థ అకాడమీ ఆఫ్ జనరల్ అండ్ టెక్నికల్ ఎడ్యుకేషన్, శ్రీపతి సేవా సమితి, ఎల్ కేఎస్ స్కూల్, ఆక్స్‌ఫర్డ్ పబ్లిక్ స్కూల్, అమరావతి ఎడ్యుకేషనల్ అండ్ కల్చరల్ అకాడమీ, శ్రీ గౌరీ గాయత్రి ఎడ్యుకేషనల్ సొసైటీ, సంస్కృతి గ్లోబల్ స్కూల్ మొదలైన 13 పాఠశాలలు అమరావతిలో తమ విద్యా సంస్థలను ప్రారంభించానికి సిద్ధమయ్యాయని కమిషనర్ తెలిపారు. ఆయా విద్యాసంస్థల ప్రమాణాలు, స్థితిగతులు పూర్తిగా తెలుసుకుని స్పష్టమైన అవగాహనతో తుది నిర్ణయానికి రావాలని ముఖ్యమంత్రి చెప్పారు. ప్రమాణాల విషయంలో ఎక్కడా రాజీపడేది లేదని స్పష్టంచేశారు.

రాజధాని రహదారులకు సంబంధించి 30 శాతం సబ్ కాంపోనెంట్స్ పనులకు ప్రపంచ బ్యాంక్ నిధులను అందిస్తోందని, ఆయా పనులను చేపట్టడానికి టెండర్ల ప్రక్రియ కొనసాగుతోందని అధికారులు తెలిపారు. సీడ్ యాక్సెస్ రహదారి, 7 సబ్ ఆర్టేరియల్ రహదారులు, మరో 3 ఇతర రహదారుల పనులు పురోగతిలో వున్నాయని అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ) సీఎండీ లక్ష్మీపార్థసారథి చెప్పారు. శాఖమూరు ఉద్యానంలో 4, 5 ఎకరాల విస్తీర్ణంలో హస్తకళల విక్రయ కేంద్రం (క్రాఫ్ట్ బజార్) ఏర్పాటు చేయబోతున్నట్టు

తెలిపారు. దీన్ని ఏర్పాటుచేయడానికి ముందుకొచ్చిన సంస్థ ఈ ప్రాజెక్టుకు ప్రాథమికంగా 'కృష్ణ కమలం' అనే పేరును సూచించిందన్నారు.

విజయవాడలో శరన్నవరాత్రి ఉత్సవాలను, తిరుపతిలో బ్రహ్మోత్సవాలను మంచి అవకాశాలుగా గుర్తించడంలో, పర్యాటక ఈవెంట్లుగా మలచడంలో మూడు ముఖ్యశాఖల అధికారులు తగిన శ్రద్ధ పెట్టలేకపోయారని ముఖ్యమంత్రి ఈ సమావేశంలో ఆవేదన వెలిబుచ్చారు. వచ్చిన ప్రతి ఒక్క అవకాశాన్నీ రాష్ట్ర ఆర్థిక అభివృద్ధిని ఊపందుకునేలా చేసేందుకు ఉపయోగించుకోవాలన్నదే తన ఆలోచనగా చెప్పారు. అమ్మవారి దర్శనార్థం విజయవాడకు వచ్చే భక్తులను మరింతగా ఆకర్షించే ఏర్పాట్లు చేసి వుండాల్సిందని, దూర ప్రాంతాల నుంచి వచ్చే వారు కనీసం రెండు రోజులు నగరంలోని వివిధ హోటళ్లలో 'స్టే' చేసేలా ఉంచగలిగితే బాగుండేదని అభిప్రాయపడ్డారు. నగరాలు, పట్టణ ప్రాంతాలలో ఇటువంటి అవకాశాలను ఉపయోగించుకుని ఆర్థిక కార్యకలాపాల్లో జోరు పెంచడం అవసరం అని చెప్పారు. అదే రాష్ట్రాభివృద్ధికి సంకేతమని అన్నారు. దేవాదాయ, పర్యాటక, పురపాలక శాఖలు మూడూ మరింత సమన్వయం చేసుకుని పనిచేసి వుంటే ఫలితాలు తప్పకుండా కనిపించేవన్నారు. పండగలు, విశేష ఉత్సవాలలో ఫుడ్ కోర్టులు, క్రాఫ్ట బజార్లు, వాణిజ్య ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను ప్రబలంగా ఆకట్టుకుంటాయని, పర్యాటకానికి ఊతం ఇస్తాయని అన్నారు.

## అమరావతిలో అంతర్జాతీయ ఈవెంట్

వచ్చే ఏడాది అమరావతి అంతర్జాతీయ పోటీలకు ఆతిథ్యం ఇవ్వడానికి సంసిద్ధం అవుతోంది. విజయవాడ కృష్ణాతీరంలో ఫార్ములా వన్ తరహాలో పవర్ బోటింగ్ రేసింగ్ వరల్డ్ ఛాంపియన్‌షిప్ పోటీలను నిర్వహించడానికి ముఖ్యమంత్రి పచ్చజెండా ఊపారు. తొలిసారిగా ఒక నదిలో నిర్వహిస్తున్న పీ-వన్ వరల్డ్ ఛాంపియన్‌షిప్ పోటీలను విజయవాడలో నిర్వహించడానికి ఆయన తన సన్నద్ధతను తెలిపారు. 10 రోజుల పాటు నిర్వహించే ఈ ఛాంపియన్‌షిప్ పోటీలకు ప్రపంచం నలుమూలల నుంచి పేరొందిన క్రీడాకారులు వస్తారని నిర్వాహకులు చెప్పారు.

నదీతీరం నుంచి 30 మీటర్ల రేంజ్‌లో పోటీలను చాలా స్పష్టంగా చూసేందుకు అవకాశం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. పదిరోజుల పోటీలలో భాగంగా ఫ్యాషన్ షో, ఫుడ్ ఫెస్టివల్ వంటి ఆకర్షణలు ఉంటాయని చెప్పారు. వీటితో పాటే సాంస్కృతిక కార్యక్రమాలు, హస్తకళల ప్రదర్శనలను నిర్వహించాలని ముఖ్యమంత్రి సూచించారు. ఈ భారీ ఈవెంట్ నిర్వహణకు ఏ కాలం అనుకూలమైనదో ఆలోచించి నిర్దిష్ట కార్య ప్రణాళికతో రావాలని చెప్పారు.

**సమావేశంలో పురపాలక మంత్రి పి. నారాయణ, ముఖ్యమంత్రి కార్యదర్శి ఎం. గిరిజాశంకర్, పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శి కరికాల వలవన్ పాల్గొన్నారు.**